



DD9 వార్త
తెలుగు దినపత్రిక

బాక్సాఫీస్ దగ్గర 'డెకాయిట్' దూకుడు..
అడివి శేష్ కెరీర్‌లోనే భారీ ఓపెనింగ్స్




సంపుటి : 02 సంచిక : 233 | హైదరాబాద్, ఏప్రిల్, సోమవారం 13, 2026 | పేజీలు : 05 వెల : 3.00

# 2029 నుంచే మహిళా రిజర్వేషన్లు


పార్లమెంట్‌లో చర్చకు రంగం సిద్ధం
మహిళా రిజర్వేషన్ అమలుకు మోడీ పిలుపు
లోక్‌సభ, రాజ్యసభ నేతలకు ప్రధాని లేఖ
ఏప్రిల్ 16 నుంచి
ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు
ఎంపీలకు బీజేపీ త్రీ లైన్ విప్ జారీ
ప్రతిపక్షాల అభ్యంతరాలు, ఖర్గే స్పందన
అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ డిమాండ్
చట్టంలో కీలక సవరణలపై కేంద్ర దృష్టి
సీట్ల పెంపు, జనగణన
నిబంధనల మార్పు ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):** మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు లేఖ రాస్తూ కీలక పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 2029లో జరిగే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి ..మిగతా 2లో





# బీఆర్ఎస్ కాదు టీఆర్ఎస్




పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
గత తప్పులు సరిచేసుకుంటున్నామని కామెంట్
తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని క్లారిటీ
గత తప్పులపై ఆత్మపరిశీలన చేసుకుంటున్నాం
తాను త్వరలో పాదయాత్ర చేస్తానని ప్రకటన
జైలుకెళ్లినంత మాత్రన సీఎం అయిపోరు
ప్రజలకు దగ్గరగా ఉండటం ఎంతో కీలకం
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలకు నాంది పలికేలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆయన వెల్లడించడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ భవిష్యత్తు వ్యూహం, గత తప్పుల విశ్లేషణ, రాబోయే ఎన్నికలపై ఆత్మవిశ్వాసం ఇవన్నీ ఆయన వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపించాయి. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో జరిగిన సమావేశం అనంతరం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన కేటీఆర్ పలు కీలక అంశాలపై స్పందించారు. ముఖ్యంగా పార్టీ పేరుమార్పు, పొత్తులపై అభిప్రాయం, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, అలాగే గతంలో జరిగిన లోపాలపై చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**పార్టీ పేరుమార్పుపై సంకేతాలు**

బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే అంశంపై ప్రశ్నించగా కేటీఆర్ స్పందిస్తూ, "ఈ అంశాన్ని మేము పరిశీలిస్తున్నాం" అని చెప్పారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ వ్యూహంపై సంకేతాలుగా భావించబడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)గా ప్రారంభమైన పార్టీ, తర్వాత జాతీయ రాజకీయాల్లో విస్తరణ లక్ష్యంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారింది. అయితే ఆ ప్రయాణం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదనే అభిప్రాయం కొంతమందిలో ..మిగతా 2లో

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

మళ్లీ బాలికలదే పై చేయి
అధికారికంగా వెల్లడించిన ఇంటర్ బోర్డ్
విద్యార్థులకు అభినందనలు తెలిపిన కేశవరావు
మొత్తం ఉత్తీర్ణత శాతం పెరిగిందని
అధికారులు వెల్లడి
ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో గణాంకాలు
బాలికలు ముందంజ, బాలురు వెనుకంజ
వాట్సాప్ ద్వారా కూడా రిజల్ట్స్ చెక్ చేసే సౌకర్యం
సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
జిల్లాల వారీగా టాప్ స్థానాల్లో మార్పులు




## ఆర్టీసీని విలీనం చేయాలి..

సీఎం రేవంత్ రెడ్డికి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ
ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి
టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం
చేయడం కార్మికుల ప్రధాన డిమాండ్
గుర్తింపు సంఘం ఎన్నికలు
నిర్వహించాలని కార్మికులు డిమాండ్
ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్లకుండా
ముందస్తు చర్యలు తీసుకోవాలి
ఏప్రిల్ 13న
లేబర్ కమిషన్ వద్ద సమావేశం
సమావేశానికి ఆర్టీసీ
యాజమాన్యం హాజరై చర్చలు జరపాలి
కార్మికుల సమస్యలను
చర్చల ద్వారా పరిష్కరించాలన్నారు.



**హైదరాబాద్, (డిడి9 వార్త):** టీజీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, పలు కార్మికుల ప్రధాన డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. ఏప్రిల్ 13వ తేదీన లేబర్ కమిషన్ వద్ద జరిగే సమావేశానికి ఆర్టీసీ ..మిగతా 2లో

## లాయర్ సుబ్బారావు నన్ను బెదిరిస్తున్నాడు

నా ఆఫీసుకు వచ్చి 10 లక్షలు అడిగిండు
నాతో అసభ్యంగా మాట్లాడాడు
మైక్రో ఫైనాన్స్ వ్యవహారంతో
నాకు ఏ సంబంధం లేదు
నన్ను అనవసరంగా
వివాదంలోకి లాగుతున్నారు
సింగర్ మంగ్లీ వెల్లడి




## ఆశా భోస్లే ఇక లేరు

ముంబైలో తుదిశ్వాస విడిచిన ప్రముఖ గాయని
అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్సలోనే మృతి
మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని వైద్యుల వెల్లడి
ప్రపంచవ్యాప్తంగా అభిమానులను
సంపాదించిన గాత్ర మాధుర్యం
ఎన్నో భాషల్లో వేల పాటలు పాడిన గాన కోకిల
లెజెండరీ సంగీత దర్శకులతో అపూర్వ ప్రయాణం
ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో గౌరవింపబడిన కళాకారిణి
తెలుగు సినీ రంగానికి అందించిన ప్రత్యేక గాన సేవ




## చర్చలు విఫలం..

పశ్చిమాసియాలో శాంతి కోసం అమెరికా – ఇరాన్ మధ్య జరిగిన చర్చలు విఫలం
ఇస్లామాబాద్ వేదికగా కీలక సమావేశం
సమావేశంలో పాల్గొన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ స్పీకర్
మొహమ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్ బృందాలు
సుమారు 21 గంటల పాటు కొనసాగిన సుదీర్ఘంగా చర్చలు
ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అర్ధాంతరంగా ముగిసిన చర్చలు .
రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగియడానికి ముందే చోటుచేసుకున్న పరిణామం
తదుపరి పరిణామాలపై అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ఉత్కంఠ

**ఇస్లామాబాద్, (డిడి9 వార్త):** అమెరికాఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందమూ కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..? ..మిగతా 2లో



## మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

మహిళా రిజర్వేషన్
వ్యతిరేకిస్తే ప్రజలే సమాధానం చెప్తారు
భారత రాజకీయ చరిత్రలో
ఈ బిల్లు ఓ మైలు రాయి
స్త్రీల అభ్యున్నతి
నినాదాలకే పరిమితం చేయొద్దు
తెలంగాణ అసెంబ్లీలోకి 60 మంది
మహిళలకు అవకాశం
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి




## సిద్దిపేట రైతులకు గడ్డితోనే గల్లా నిండా డబ్బు..

సిద్దిపేటకు బయో గ్యాస్ ప్లాంట్
రైతులకు అదనపు ఆదాయం
ఇంధన దిగుమతులపై తగ్గింపు లక్ష్యం
పెట్టుబడులకు కొత్త అవకాశాలు





**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నర్మెట్టలో బయో గ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2047 ఆర్థిక లక్ష్యాలను అందుకునే ..మిగతా 2లో

## సిద్ధిపేట రైతులకు 'గడ్డి'తోనే గల్లా నిండా డబ్బు..

మొదటిపేజీ తరువాయి



దిశగా అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం చేపట్టిన కొన్ని మంచి పథకాలను కూడా ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని ఆయన తెలిపారు.

ప్రస్తుతం మన దేశానికి అవసరమైన ఇంధనంలో 65 శాతం ఇతర దేశాల నుండి దిగుమతి అవుతోందని, అంతర్జాతీయ యుద్ధాల వల్ల క్రూడాయిల్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో కాలుష్య రహితమైన బయో గ్యాస్ ఫ్యాక్టరీలు ఎంతో అవసరమని, డిసెంబర్ నాటికే ఈ ప్లాంట్ అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ పరిశ్రమల అవసరం ఉంటే అక్కడ ఎలాంటి భేషజాలు లేకుండా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

సిద్ధిపేట ప్రాంతానికి బయో గ్యాస్ ప్లాంట్ రావడం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు సమృద్ధిగా అందుబాటులోకి రావడం వల్లే ఈ ప్రాంతానికి కంపెనీలు తరలివస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ ప్లాంట్ వల్ల రైతులకు రెట్టింపు లాభం చేకూరుతుందని, వరి ధాన్యంతో పాటు వరి గడ్డిని అమ్మడం ద్వారా కూడా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. బయో ఫ్యూయల్స్ అందుబాటులోకి వస్తే యుద్ధాలు సంభవించినా దేశంలో గ్యాస్ కొరత ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. గడ్డితో గ్యాస్ తయారు చేయడం అద్భుతమైన ప్రక్రియ అని, ఇది ఇంధన కొరతను తీరుస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ వారు సోదరభావంతో మెలగాలని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అదే విధంగా తెలంగాణ వారు పెట్టుబడులు పెట్టేందుకు అమరావతిలో కూడా అవకాశాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.




## లాయర్ సుబ్బారావు నన్ను బెదిరిస్తున్నాడు

- నా ఆఫీసుకు వచ్చి 10 లక్షలు అడిగిండు
- నాతో అసభ్యంగా మాట్లాడాడు
- మైక్రో ఫైనాన్స్ వ్యవహారంతో నాకు ఏ సంబంధం లేదు
- నన్ను అనవసరంగా వివాదంలోకి లాగుతున్నారు
- సింగర్ మంగ్లీ వెల్లడి



హైదరాబాద్, (డిడి9 వార్త): ప్రఖ్యాత గాయని, నటిగా గుర్తింపు పొందిన మంగ్లీ చుట్టూ ఇటీవల నెలకొన్న వివాదం కొత్త మలుపు తిరిగింది. తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ న్యాయవాది సుబ్బారావు పై ఆమె పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వ్యవహారం ప్రస్తుతం మీడియాలో చర్చనీయాంశంగా మారింది. తన తరఫు న్యాయవాదితో కలిసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మంగ్లీ, సుబ్బారావు తనను వేధిస్తున్నారని, దుష్ప్రచారం చేస్తున్నారని లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె పలు సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల సుబ్బారావు తన కార్యాలయం వద్దకు వచ్చి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని, ఆ డబ్బు ఇవ్వనందుకు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ, మీడియా ద్వారా పరువు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదులో భాగంగా, తనను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని కూడా మంగ్లీ ఆరోపించారు. డబ్బు ఇవ్వకపోతే తనపై తప్పుడు ప్రచారం చేస్తానని, వివాదంలోకి లాగుతానని హెచ్చరించారని ఆమె పేర్కొనడం గమనార్హం.

**మైక్రోఫైనాన్స్ మోసం ఆరోపణలు**

ఇటీవల అడ్వకేట్ సుబ్బారావు, మంగ్లీపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ, మైక్రోఫైనాన్స్ పేరుతో రూ.10 కోట్ల మేర మోసం జరిగిందని ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం రెండు వైపులా ఆరోపణలతో తీవ్రరూపం దాల్చింది. అయితే, ఈ ఆరోపణలను మంగ్లీ తీవ్రంగా ఖండించారు. "ఫైనాన్స్ మోసం కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంగ్లీ, సుబ్బారావు తనపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసి, ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారు. ఇది పూర్తిగా అబద్ధం" అని ఆమె మండిపడ్డారు.

**తన జీవితం, విలువలపై స్పష్టత**

తన వ్యక్తిగత జీవితం, వృత్తి పట్ల మంగ్లీ స్పష్టత ఇచ్చారు. "నాకు చేతినిండా పని ఉంది. ప్రజలను మోసం చేసే అవసరం లేదు. పాటలే నా ప్రపంచం. కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను" అని పేర్కొన్నారు. తనకు డబ్బు ఆశ లేదని, కళను ప్రేమించే వ్యక్తినని చెప్పారు. మైక్రోఫైనాన్స్ బాధితుల అంశంపై కూడా మంగ్లీ స్పందించారు. "బాధితుల తరఫున నేను కూడా పోరాడుతా. ఎవరు మోసం చేసినా వారికి శిక్ష పడాలి" అని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలతో తాను న్యాయపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు.

తన కుటుంబ సభ్యులను కూడా ఈ వివాదంలోకి లాగుతున్నారని మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తన తమ్ముడిపై వస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. "డబ్బు కట్టలతో ఉన్న వ్యక్తి నా తమ్ముడు కాదు. మా కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారు" అని అన్నారు. మంగ్లీ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. రెండు వైపులా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టే అవకాశముంది. సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా, సంబంధిత పత్రాలను పరిశీలించి నిజానిజాలు వెలికి తీయనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ వ్యవహారం గాయని మంగ్లీ, అడ్వకేట్ సుబ్బారావు మధ్య తీవ్ర ఆరోపణల యుద్ధంగా మారింది. ఒకవైపు మోసం ఆరోపణలు, మరోవైపు దుష్ప్రచారం, బెదిరింపుల ఆరోపణలు——ఇవి ఈ కేసును మరింత క్లిష్టంగా మార్చుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో నిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ వివాదం రాజకీయ, సినీ, మీడియా వర్గాల్లో చర్చకు దారి తీస్తూనే ఉంటుంది.

# బీఆర్ఎస్ కాదు టీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ టీఆర్ఎస్‌గా మారే అవకాశాన్ని పరిశీలించడం వ్యూహాత్మక నిర్ణయంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**పొత్తులపై స్పష్టత**

రాబోయే ఎన్నికలలో ఇతర పార్టీలతో పొత్తులపై ప్రశ్నించగా కేటీఆర్ స్పష్టంగా స్పందించారు. "మాకు పొత్తులు కలిసిరావు, కుదరవు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ స్వతంత్రంగా పోటీ చేసే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. గతంలో కూడా బీఆర్ఎస్ ఎక్కువగా ఒంటరిగానే పోటీ చేసి విజయాలు సాధించిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**గత తప్పులపై ఆత్మపరిశీలన**

పార్టీ గతంలో చేసిన తప్పులపై కూడా కేటీఆర్ ఆత్మపరిశీలన వ్యక్తం చేశారు. "మేము కొన్ని చిన్నచిన్న తప్పులు చేశాం. వాటి వల్ల ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరిగింది" అని అంగీకరించారు. ఈ వ్యాఖ్యలు పార్టీ లోపాలను బహిరంగంగా అంగీకరించినట్లుగా భావించబడుతున్నాయి. ఇక ఆ తప్పులపై అధ్యయనం చేసి, లోపాలను సరిదిద్దుకుంటామని కేటీఆర్ తెలిపారు. "ఇప్పటి పరిస్థితుల్లో ప్రజలతో మళ్లీ దగ్గరవ్వడం మా ప్రధాన లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ భవిష్యత్తు వ్యూహంలో కీలక మార్పుగా భావించవచ్చు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "అన్ని పథకాలలో కాంగ్రెస్ విఫలమైంది" అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయిందని, అభివృద్ధి కార్యక్రమాలు సరిగా ముందుకు సాగడం లేదని ఆయన విమర్శించారు. ఈ విమర్శలు రాబోయే రోజుల్లో రాజకీయంగా మరింత వేడి పెంచే అవకాశముంది.


**కేసీఆర్‌పై నమ్మకం**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కేటీఆర్ పూర్తి నమ్మకం వ్యక్తం చేశారు. "ఈసారి వచ్చేది బీఆర్ఎస్సే. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని నింపేలా ఉన్నాయి.

అలాగే కేసీఆర్‌ను చంద్రుడితో పోలుస్తూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఆసక్తికరంగా మారాయి. "చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్ముకున్నాయి. అవి తొలిగితే చంద్రుడు మళ్లీ ప్రకాశిస్తాడు" అని అన్నారు. ఇది ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు తాత్కాలికమేనని, భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి బలంగా ఎదుగుతుందని సూచిస్తున్న వ్యాఖ్యగా భావించవచ్చు.

**డీలిమిటేషన్‌పై వ్యాఖ్యలు**

డీలిమిటేషన్ అంశంపై కూడా కేటీఆర్ స్పందించారు. "డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయి" అని తెలిపారు. ఈ మార్పులు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



**ఇతర రాష్ట్రాల పార్టీలపై స్పందన**

ఇతర రాష్ట్రాల పార్టీలు తెలంగాణలోకి వస్తే ఎలా చూస్తారు అన్న ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ, "వస్తానంటే కాదనలేం. మేమూ గతంలో మహారాష్ట్రకు వెళ్లాం కదా" అని అన్నారు. ఇది రాజకీయంగా ఓపెన్ దృక్పథాన్ని సూచించే వ్యాఖ్యగా భావించవచ్చు.

**రాజకీయాల్లో డబ్బు ప్రభావం**

ప్రస్తుతం రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. "రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత విపరీతంగా పెరిగింది" అని అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపే అంశమని ఆయన సూచించారు.

**మేధావుల మౌనం**

మేధావుల పాత్రపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మేధావులు అనుకున్నవాళ్లు ఇప్పుడు మాట్లాడటం లేదు" అని అన్నారు. సమాజంలో కీలకమైన అంశాలపై మేధావులు ముందుకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**చరిత్రలో నిలిచిన సీఎంలు**

చివరగా చరిత్రలో నిలిచిపోయేలా పాలించిన నాలుగు ముఖ్యమంత్రులను కేటీఆర్ ప్రస్తావించారు. వారు ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, మరియు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మొత్తంగా కేటీఆర్ వ్యాఖ్యలు చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు వ్యూహంపై స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. పార్టీ పేరుమార్పు పరిశీలన, పొత్తులపై స్పష్టత, గత తప్పులపై ఆత్మపరిశీలన, కాంగ్రెస్‌పై దాడి——ఇవి అన్నీ రాబోయే ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్న సంకేతాలుగా భావించవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలకు ఇవి దారితీయడం ఖాయం.

## చర్చలు విఫలం..

మొదటిపేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..? నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..? అమెరికా ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..?

**యుద్ధ జ్వాలలు మళ్లీ రగులుతాయా..!**

అమెరికాఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండు వారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతో పాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళన నెలకొంది.

**ఇరాన్ ప్రతిఘటన..**

అమెరికా ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా హూతీలు, హెజ్‌బొల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి.

**ఆర్థిక సంక్షోభం**

హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.

**అణు భయం..**

ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్లు ఆ దేశం చెప్పుకొచ్చింది. తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు.

**భారత్‌పై ప్రభావం ఉంటుందా?**

పశ్చిమాసియా యుద్ధం మరింత విస్తరిస్తే.. అది భారత్‌కూ ఇబ్బందే. మన దేశ ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. చమురు, సహజవాయువు సరఫరాలకు అంతరాయం కలిగితే.. దేశ ఆర్థిక వ్యవస్థపై అది తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



## 2029 నుంచే మహిళా రిజర్వేషన్లు

మొదటిపేజీ తరువాయి



తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

మోదీ తన లేఖలో మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం దేశ ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుస్తుందని చెప్పారు. మహిళలు ఇప్పటికే అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం సమాజానికి అవసరమని అభిప్రాయపడ్డారు. నారీ శక్తి వందన్ అధినియం 2023 పార్లమెంట్ ఆమోదం పొందిన రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు.ఈ చట్టానికి సంబంధించిన సవరణ బిల్లులపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో అన్ని పార్టీల ఎంపీలు పాల్గొని చర్చలో భాగస్వామ్యం కావాలని ప్రధాని కోరారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన ఈ కీలక నిర్ణయంలో అందరూ ఏకమై ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇక ఈ సమావేశాల నేపథ్యంలో బీజేపీ తన ఎంపీలకు త్రీ లైన్ విప్ జారీ చేసింది. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరిగే ప్రత్యేక సమావేశాల్లో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించింది. ఈ సమయంలో ఎలాంటి సెలవులు తీసుకోకుండా సభల్లో పాల్గొనాలని సూచించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుల ఆమోదం లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే కేంద్ర నిర్ణయంపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ప్రధానికి లేఖ రాస్తూ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా చట్టంలో చేయబోయే సవరణలపై ముందుగా పూర్తి వివరాలు ఇవ్వకుండా ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై స్పష్టత లేకుండా చర్చ జరగడం ప్రయోజనకరం కాదని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఏప్రిల్ 29న అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక ఈ చర్చలు జరపాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయని గుర్తు చేశారు.ఇక కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణలలో ముఖ్యంగా ఒకటి జనగణన నిబంధనలకు సంబంధించినది. ప్రస్తుత చట్టం ప్రకారం కొత్త జనగణన పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రావాల్సి ఉంది. అయితే ఈ నిబంధనను సవరించి 2011 జనగణన ఆధారంగా 2029 ఎన్నికల నుంచే రిజర్వేషన్లు అమలు చేసేలా మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మరో ముఖ్యమైన సవరణగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఉన్న సీట్లలోనే మహిళలకు 33 శాతం కేటాయించడం కష్టమవుతుందని భావించి, మొత్తం సీట్ల సంఖ్యను పెంచి అందులో మహిళలకు ప్రత్యేకంగా వాటా కల్పించాలని యోచిస్తోంది. లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 నుంచి సుమారు 800కు పైగా పెంచే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీని ద్వారా మహిళలకు పెద్దఎత్తున ప్రాతినిధ్యం కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.మొత్తం మీద మహిళా రిజర్వేషన్ చట్టంపై కేంద్రం, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. ఒకవైపు మహిళల రాజకీయ సాధికారతకు ఇది కీలక అడుగు అని ప్రభుత్వం చెబుతుంటే, మరోవైపు పారదర్శకత, సమగ్ర చర్చ అవసరమని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. రాబోయే పార్లమెంట్ సమావేశాలు ఈ విషయంలో కీలక మలుపు తిప్పే అవకాశముంది.

## ఆర్టీసీని విలీనం చేయాలి..


మొదటిపేజీ తరువాయి

యాజమాన్యం హాజరై సమ్మె నివారణకు చర్చలు జరిపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డికి సాంబశివరావు ఆదివారం లేఖ రాశారు.

**ఆర్టీసీ కార్మికుల సమస్యలు**

'ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పలు దఫాలుగా చర్చలు జరిపినా వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. దీంతో కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, రెండు వేతన సవరణల అమలు, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహణ, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్త బస్సులు కొనుగోలు చేసి సంస్థను విస్తరిస్తామన్నారు. కానీ అలాంటి హామీలు ఏవీ అమలు కాకపోవడంతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఆర్టీసీలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారు. ఈ బస్సులో పనిచేస్తున్న డ్రైవర్స్ ఆర్టీసీకి సంబంధం లేదు. ఈ బస్సుల మీద ప్రభుత్వ ఇస్తున్న సబ్సిడీ ప్రైవేట్ వ్యక్తులకే చెందుతున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వం తీసుకుని ఆర్టీసీకి ఇవ్వడం వలన ఆదాయం కూడా సంస్థకు చెందుతున్నది. ఆర్టీసీలో ప్రైవేట్ గుత్తాధిపత్యం కూడా తగ్గుతుంది' అని ఆయన తెలిపారు.

'గత 11 ఏళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంతో ఉద్యోగులపై పని భారం పడుతున్నది.





దీంతో కార్మికులు తీవ్ర అనారోగ్యాలుకు గురైతున్నారు. పీఎఫ్‌కు సంబంధించి ఉద్యోగస్థుల నుండి రికవరి చేసిన సుమారు రూ.1200 కోట్లను యాజమాన్యం రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపకపోవడం వలన చాలా మంది ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్లు గత 5 సంవత్సరాలుగా విడుదల కాలేదు. కార్మికులు అనేక సమస్యలు సమ్మె నోటీసులో యాజమాన్యానికి ఇవ్వడం జరిగింది. ఏప్రిల్ 9వ తేదీన లేబర్ కమిషన్ వద్ద జరిగిన సమావేశానికి ఆర్‌టీసీ యాజమాన్యం రాకపోవడంతో తిరిగి 13వ తేదీకి సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులు సమ్మెకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. కావున ఆర్‌టీసీ కార్మికులు సమ్మెకు వెళ్ళకుండా చర్చలు జరిపి వారి డిమాండ్ల సాధనకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి' అని సీఎంకు రాసిన లేఖలో సాంబశివరావు పేర్కొన్నారు.

# ఆశా భోస్లే ఇక లేరు

- ముంబైలో తుదిశ్వాస విడిచిన ప్రముఖ గాయని
- అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్సలోనే మృతి
- మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని వైద్యుల వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించిన గాత్ర మాధుర్యం
- ఎన్నో భాషల్లో వేల పాటలు పాడిన గాన కోకిల
- లెజెండరీ సంగీత దర్శకులతో అపూర్వ ప్రయాణం
- ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో గౌరవింపబడిన కళాకారిణి
- తెలుగు సినీ రంగానికీ అందించిన ప్రత్యేక గాన సేవ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత సంగీత ప్రపంచాన్ని తన గాత్రంతో మంత్ర ముగ్ధులను చేసిన ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. 92 ఏళ్ల వయసులో ఆమె ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్ తుదిశ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను శనివారం ఆస్పత్రిలో చేర్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రమైన అలసటతో పాటు ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించిందని వైద్యులు పేర్కొన్నారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి మరింత విషమించడంతో చివరకు ఆమె ప్రాణాలు కోల్పోయారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణాన్ని కుటుంబ సభ్యులు అధికారికంగా ధృవీకరించారు. ఈ వార్త తెలిసిన వెంటనే దేశవ్యాప్తంగా సినీ, సంగీత రంగాల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆశా భోస్లే తన గాత్రంతో అనేక తరాలను అలరించిన అపూర్వ గాయని. ఆమె స్వరం ప్రత్యేకత, భావ వ్యక్తీకరణలో ఉన్న లోతు వల్లే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించారు. హిందీ సినీ సంగీతానికి ఆమె చేసిన సేవలు అమోఘం. పాప్, ఘజల్, క్లాసికల్, ఫోక్ వంటి విభిన్న శైలుల్లో పాటలు పాడుతూ తన ప్రతిభను చాటుకున్నారు.తన సుదీర్ఘ గాన ప్రయాణంలో ఆమె ప్రముఖ సంగీత దర్శకులతో కలిసి పనిచేశారు. ముఖ్యంగా బప్పి లహరి, ఇలయరాజ, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజాలతో కలిసి ఎన్నో మధుర గీతాలను అందించారు. ప్రతి తరానికి తగినట్లు తన గానాన్ని మార్చుకుంటూ, కొత్తదనాన్ని జోడించడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది.

ఆమె గాత్రంలో వచ్చిన ఎన్నో పాటలు ఇప్పటికీ సంగీత ప్రేమికుల హృదయాల్లో నిలిచిపోయాయి. ముఖ్యంగా క్యారవాన్ చిత్రంలోని "పియా తూ అబ్ తో ఆజా", హరే రామ హరే కృష్ణలోని "దమ్ మారో దమ్", అలాగే డాన్ చిత్రంలోని "యే మేరా దిల్" వంటి పాటలు ఆమెకు అపార ఖ్యాతి తెచ్చాయి. ఈ గీతాలు కాలం గడిచినా ఎప్పటికీ పాతబడని క్లాసిక్స్‌గా నిలిచాయి. భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆమె ప్రతిభకు గుర్తింపు లభించింది. అత్యధిక సంఖ్యలో పాటలు పాడిన మహిళా గాయని గా గిన్నీస్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించారు. 2000 సంవత్సరంలో ఆమెకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించగా, 2008లో దేశంలోని రెండవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్‌తో సత్కరించారు.

ఆశా భోస్లే దాదాపు 20కి పైగా భాషల్లో పాటలు పాడారు. హిందీ, మరాఠీతో పాటు తమిళ్, తెలుగు, బెంగాలీ, మలయాళం, కన్నడ, గుజరాతీ, ఒడియా వంటి భాషల్లో ఆమె గానం వినిపించింది. ప్రతి భాషలోనూ తన గాత్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.తెలుగు సినీ రంగంలో ఆమె గాత్రం తక్కువగానే వినిపించినప్పటికీ, పాడిన పాటలు మాత్రం ప్రత్యేక స్థానం సంపాదించాయి. పాలు నీళ్లు చిత్రంలోని "ఇది మౌన గీతం" పాటతో ఆమె తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే చిన్న కృష్ణుడులో "జీవితం సప్తసాగరం" పాటను ఎస్పీబీతో కలిసి ఆలపించారు.

అదే విధంగా అశ్వమేధం, ప్రేమకు ప్రేమంటే తెలుసా, పవిత్ర బంధం, ఇరువర్ వంటి చిత్రాల్లో ఆమె గాత్రం వినిపించింది. చివరిగా చందమామ చిత్రంలోని "నాలో ఊహలకు.. నాలో ఆశలకు" పాటతో తెలుగు ప్రేక్షకులను అలరించారు.ఆశా భోస్లే మరణంతో భారత సంగీత ప్రపంచం ఒక మహానుభావిని కోల్పోయింది. ఆమె గాత్రం, ఆమె పాటలు, ఆమె సృష్టించిన మధుర జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఆమె లేకపోయినా, ఆమె గానం మాత్రం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

- - మళ్లీ బాలికలదే పై చేయి
- - అధికారికంగా వెల్లడించిన ఇంటర్ బోర్డ్
- - విద్యార్థులకు అభినందనలు తెలిపిన కేశవరావు
- - మొత్తం ఉత్తీర్ణత శాతం పెరిగిందని అధికారులు వెల్లడి
- - ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో గణాంకాలు
- - బాలికలు ముందంజ, బాలురు వెనుకంజ
- - వాట్సాప్ ద్వారా కూడా రిజల్ట్స్ చెక్ చేసే సౌకర్యం
- - సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
- - జిల్లాల వారీగా టాప్ స్థానాల్లో మార్పులు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, బోర్డు కార్యదర్శి యోగితా రాణాతో పాటు ఇతర ఉన్నతాధికారులు కలిసి ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విఫలమైన వారు నిరాశ చెందకుండా ముందుకు సాగాలని సూచించారు.

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా జీవితంలో ఎదురయ్యే అనుభవాల నుంచి కూడా నేర్చుకోవాలని కేశవరావు పేర్కొన్నారు. ఫెయిల్ అయిన వారు దిగులు చెందకుండా రాబోయే సప్లిమెంటరీ పరీక్షలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థికి మరో అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ఈ ఏడాది మొత్తం సుమారు 9 లక్షల 70 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యారు. అందులో మొదటి సంవత్సరం (ఫస్టియర్)లో 3,23,807 మంది, రెండో సంవత్సరం (సెకండియర్)లో 3,58,490 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఫలితాల్లో గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా మెరుగుదల కనిపించిందని అధికారులు తెలిపారు.

ఫస్టియర్ ఫలితాల్లో బాలికలు 74.40 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలుర ఉత్తీర్ణత 57.69 శాతంగా నమోదైంది. ఇదే విధంగా సెకండియర్ ఫలితాల్లో బాలికలు 78.65 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా ఉంది. ఇలా రెండు సంవత్సరాల్లోనూ బాలికలు స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు.గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2025లో ఫస్టియర్‌లో 66.91 శాతం ఉండగా, ఈసారి 66.94 శాతానికి పెరిగింది. అలాగే సెకండియర్‌లో 72.43 శాతం నుంచి 75.61 శాతానికి పెరిగింది. ఈ మార్పు విద్యార్థుల పనితీరులో మెరుగుదల చూపుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఈసారి విద్యార్థులకు సౌకర్యంగా ఫలితాలను వాట్సాప్ ద్వారా కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులు తమ స్మార్ట్‌ఫోన్‌లో ఒక నిర్దిష్ట నంబర్ సేవ్ చేసుకుని, 'Hi' మెసేజ్ పంపి, 'BIE Exam Result' అని టైప్ చేసి తమ ఫలితాలను తెలుసుకోవచ్చు. ఈ విధానం విద్యార్థులకు వేగవంతమైన సేవ అందించడంలో సహాయపడుతోంది.



ఇక సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ఇంటర్ బోర్డు ప్రకటించింది. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఏప్రిల్ 13 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల చివరి తేదీ ఏప్రిల్ 20గా నిర్ణయించారు. ఇదే సమయంలో సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపులు కూడా ప్రారంభం కానున్నాయి. మే 13 నుంచి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుంచి ప్రారంభమవుతాయి. వీటిని కూడా రెండు విడతలుగా నిర్వహిస్తారు. రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా తదుపరి చదువులకు వెళ్లే అవకాశం కల్పించేందుకు త్వరగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా చూస్తే, ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్ మొదటి స్థానంలో నిలిచింది. సెకండియర్ ఫలితాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం మీద ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు విద్యార్థుల్లో నమ్మకం పెంచే విధంగా ఉన్నాయని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ఇదే :**

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 13 నుంచి దరఖాస్తులు
చివరి తేదీ ఏప్రిల్ 20.
అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపు ఏప్రిల్ 13 నుంచి ప్రారంభం
ఏప్రిల్ 20 చివరి తేదీ.
మే 13 నుంచి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు
రెండు సెషన్స్‌లో పరీక్షల నిర్వహణ
మే 22న ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ప్రారంభం
రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్స్ నిర్వహణ

# మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- మహిళా రిజర్వేషన్ వ్యతిరేకిస్తే ప్రజలే సమాధానం చెప్తారు
- భారత రాజకీయ చరిత్రలో ఈ బిల్లు ఓ మైలు రాయి
- స్త్రీల అభ్యున్నతి నినాదాలకే పరిమితం చేయొద్దు
- తెలంగాణ అసెంబ్లీలోకి 60 మంది మహిళలకు అవకాశం
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మహిళా సాధికారతపై మాట్లాడే అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు నిర్మొహమాటంగా మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. మహిళలకు న్యాయం చేయాలనే నిజమైన సంకల్పం ఉన్నట్లయితే, ఈ చారిత్రాత్మక బిల్లును వ్యతిరేకించడానికి ఎటువంటి కారణమూ ఉండదని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించే పార్టీలకు దేశ మహిళలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం దశాబ్దాల నాటి ఆకాంక్షగా కొనసాగుతుందని పేర్కొన్న బండి సంజయ్, ఈ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం భారత రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అభివర్ణించారు. మహిళల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు ఇది కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఈ బిల్లును సమర్థించాలని, మహిళల అభ్యున్నతిని కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా కార్యరూపం దాల్చాలని సూచించారు.

"మహిళల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు. పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది. డీలిమిటేషన్ అనంతరం పార్లమెంట్ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దాని ఫలితంగా తెలంగాణ అసెంబ్లీలో సుమారు 60 మంది మహిళలకు అవకాశాలు లభించే అవకాశం ఉంది" అని ఆయన వివరించారు.

ఈ నేపథ్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ చట్టాన్ని 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే అమల్లోకి తీసుకురావాలనే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర వర్గాలు వెల్లడిస్తున్నాయి.



## బీర్కూర్ మండలంలో జూనియర్ కాలేజీ నిర్మాణానికి స్థలం సేకరణ

**బీర్కూర్, ఏప్రిల్ 12(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలో 84 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి ఒక కీలక ముందడుగు పడింది.ఈ క్రమంలో కాలేజీ నిర్మాణం కోసం తిమ్మాపూర్ శివారులో గల స్థలాన్ని అధికారికంగా సేకరించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. స్థలం సేకరణ పూర్తవడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సవాయి సింగ్, ఆర్ఐ విజయ్ కుమార్, ఇరిగేషన్ అధికారులు, తిమ్మాపూర్ సర్పంచ్ అప్పారావు, మాజీ ఎంపీపీ రఘు,బస్వారాజ్ పటేల్, యువనాయకులు మియాపూర్ శశికాంత్, విట్టల్, కొరిమె రఘు,పృధ్వి తదితరులు పాల్గొన్నారు.



## బీర్కూర్ గ్రామంలో మానవత్వం చాటిన యువనాయకుడు శశికాంత్

**బీర్కూర్, ఏప్రిల్ 12(డిడి9 వార్త):**

బీర్కూర్ గ్రామంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే విధంగా ఒక సేవా కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామానికి చెందిన నిరుపేద వ్యక్తి కాశబోయిన పీరయ్యకు ఆపన్న హస్తంగా నిలుస్తూ, మియాపురం శశికాంత్ 25 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న పీరయ్యకు ఈ సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది.ప్రస్తుత కాలంలో వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న పరిస్థితుల్లో, సమాజంలో ఇంకా మానవత్వం జీవించి ఉందని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. అవసరంలో ఉన్న వారిని గుర్తించి వారికి తోడ్పాటు అందించడం గొప్ప సేవగా భావించబడుతుంది. చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి పెద్ద ఊరటనిస్తుంది అనే విషయాన్ని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ, సమాజంలో నిరుపేదలు, అనాధలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించామన్నారు. అన్నదానం వంటి మహోన్నతమైన సేవ ద్వారా ఆకలి బాధను తగ్గించడం అత్యంత పుణ్యకార్యంగా భావించబడుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో విజయ ప్రకాష్, కోరిమే రఘు, ప్రశాంత్, సాయిరాం, బాలకృష్ణ, పృథ్వీరాజ్, మేఘనాథ్, అశోక్, అజార్, ప్రశాంత్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ సర్కార్ కృషి

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్
- మెహతార్ కమ్యూనిటీ సంఘం వార్షికోత్సవం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 12 ( డిడి9 వార్త ):**

సమాజంలో వెనకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తెలంగాణ తోటి, మెహతార్ కమ్యూనిటీ సంఘం 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం బొల్లారం కొత్త బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితుల హక్కుల కోసం కృషి చేస్తున్న సంఘ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహన్ కన్నన్, కదిర్వన్, వేణుగోపాల్ రెడ్డి, రామ్, బాలరాజు, ప్రేమ్ కిరణ్, శ్యామ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



# నేర నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకం.

- ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్ నందు 40 సీసీటీవీ కెమెరాల ప్రారంభం.
- 24 గంటలు నేను నియంత్రణలో కృషి చేసేది సీసీటీవీ కెమెరా
- మరింత విస్తృతంగా ప్రజలు ప్రతి ఒక్కరు కెమెరాల ఏర్పాటు కృషి చేయాలని పిలుపు.
- గంజాయి వల్ల కలుగు అనార్థాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

నేరాలను అరికట్టడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన 40 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు 24 గంటలపాటు నిరంతర పర్యవేక్షణ చేస్తూ నేర నియంత్రణలో పోలీసులకు మూడో కంటిగా సహకరిస్తాయని అన్నారు. కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు గణనీయంగా తగ్గుతాయని, నేరస్థులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సులభతరం అవుతుందని వివరించారు. ప్రజల భద్రత కోసం ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సంస్థలు తమ పరిధిలో సీసీటీవీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజలు ముందుకొచ్చి సహకరిస్తే నేరాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించడం, వినియోగించడం, వ్యాపారం, చేయడం తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను ధరించాలని తెలిపారు. గ్రామాలలో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని స్వచ్ఛందంగా తీర్మానాలు చేస్తూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఇన్స్పెక్టర్ బండారి రాజు, ఇచ్చోడా సర్పంచ్ కోడప జల్లై జాకు, బోరిగామ సర్పంచ్ అసిఫ్ ఖాన్, ఇచ్చోడ జిపి ఈఓ సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# మృతుని కుటుంబానికి వార్డు సభ్యులు కొంపల్లి మౌనిక నర్సిములు అండ

- క్వింటల్ బియ్యం అందజేత

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ గ్రామానికి చెందిన యువకుడు కొంపెల్లి జహంగీర్ ఇటీవల ప్రమాదవశాత్తు కెనాల్‌లో నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ఘటనతో మృతుడి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.ఈ నేపథ్యంలో స్థానిక వార్డు సభ్యుడు కొంపెల్లి మౌనిక నర్సింలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికంగా తోడ్పాటునందించారు. కుటుంబానికి క్వింటాల్ సన్న బియ్యం వంట సామాగ్రిని అందజేసి అండగా నిలిచారు.వీరితోపాటుగా ముదిరాజ్ సంఘం నాయకులు మృతుడి కుటుంబానికి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

# స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 298వ అన్నదానం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 12 (డిడి9 వార్త ):**

హైదరాబాద్ నగరంలో ఆకలితో అలమటిస్తున్న అనాథలు, నిరాశ్రయుల కోసం స్కై ఫౌండేషన్ ఆదివారం 298వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫౌండేషన్ సభ్యులు వాహనంలో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ, ఫుట్ పాత్‌లపై నివసించే నిరుపేదలను గుర్తించి వారికి ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్ మాట్లాడుతూ... ఆకలితో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ సేవా యజ్ఞం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్ నాయకుల అండ

- బి ఆర్ ఎస్ నాయకులు రూ. 12,000 వెల నగదు అందజేత

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**


జగదేవపూర్ గ్రామానికి చెందిన యువకుడు కొంపెల్లి జహంగీర్ ముదిరాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు కెనాల్‌లో నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ఘటనతో మృతుడి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో జగదేవపూర్ బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నగదు రూ.12,000/ ఆర్థిక సహాయం అందజేశారు. పరమర్శించిన వారిలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎంపిటిసి కవిత శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు వార్డ్ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ బచ్చలి భాస్కర్ మచ్చ బాబు కొంపల్లి మౌనిక నర్సింలు కొంపల్లి మహేష్ కొంపల్లి మైసయ్య కొంపల్లి కనకయ్య ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.



# మునిగడప లో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ని దర్శించుకున్న ప్రతాప్ రెడ్డి

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం సందర్భంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారిని గజ్వేల్ బి ఆర్ ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి మహిమగల అమ్మవారు అమ్మవారి కృప కటాక్షలు దీవెనలు ప్రజల అందరిపై ఉండాలని అష్టయిరోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిలలాని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో అమ్మవారి భక్తుడు గ్రామాల సర్పంచులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ పలుగుగడ్డ సర్పంచ్ కనకయ్య శ్రీశైలం యాదవ్ భక్తిలు తదితరులు పాల్గొన్నారు.



# ఐమాక్స్ లైట్లను మరమ్మత్తు చేయించిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన ఐమాక్స్ స్ట్రీట్ లైట్లు కొంతకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ పాలకవర్గ సభ్యులు స్పందించారు. ఆదివారం ప్రత్యేకంగా సిబ్బందిని పంపించి మెయిన్ రోడ్డుపై ఉన్న ఐమాక్స్ లైట్లను మరమ్మత్తు చేయించారు. లైట్లను సరిచేయడంతో రాత్రి సమయంలో రహదారిపై వెలుతురు మెరుగుపడింది. దీంతో ప్రయాణికులు, వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఇకపై లైట్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు పాలకవర్గ సభ్యులు బచ్చలి భాస్కర్ మచ్చ బాబు తదితరులు పాల్గొన్నారు.




# గాంధీ మెడికల్ కాలేజీలో ఘనంగా రాష్ట్రస్థాయి ఫోరెన్సిక్ మెడిసిన్ సదస్సు

- ముగిసిన రెండు రోజుల స్టేట్ లేవల్ కాన్ఫరెన్స్

**సికింద్రాబాద్, ఏప్రిల్12 (డిడి9 వార్త ):**

సికింద్రాబాద్ లోని గాంధీ మెడికల్ కాలేజీ వేదికగా రెండురోజుల పాటు జరిగిన తెలంగాణ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ రెండో వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సు ( టీజీఏఎఫ్ఎంసీఓఎన్ 2026) ఆదివారం ముగిసింది . గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఫోరెన్సిక్ రంగంలోని ప్రముఖ నిపుణులు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆదర్శ్ కుమార్ కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సవాళ్ల గురించి వివరించగా, డాక్టర్ మధుసూదన్ రెడ్డి డీఎన్ఏ పరీక్షల్లో వస్తున్న మార్పులను తెలియజేశారు. వైద్యులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ పొందేందుకు ఉన్న చట్టాల గురించి డాక్టర్ ఇంద్రజిత్ ఖండేకర్ వివరించారు. అలాగే కోర్టులో వైద్యులు సాక్ష్యం చెప్పేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు.సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన తుపాకుల ప్రదర్శన, క్లూస్ టీమ్ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలను ఎలా సేకరించాలో పోలీసులకు, వైద్యులకు ప్రాక్టికల్‌గా చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల కోసం క్విజ్, షార్ట్ ఫిల్మ్ పోటీలను నిర్వహించి వారికి బహుమతులను అందచేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.ఇందిరా, సూపరింటెండెంట్ డా.వాణి లు పాల్గొన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యులు, పోలీసులు, న్యాయ నిపుణుల మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు ప్రొఫెసర్ డా.కృపాల్ సింగ్, డా.లావణ్య, డా.సూరజ్,డా.లక్ష్మీకాంత్ రెడ్డి, పీజీ డాక్టర్ విక్రమ్ లు తెలిపారు



# బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 12 ( డిడి9 వార్త ):**

బొల్లారం సదర్ బజార్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలోని స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్‌ను నియోజకవర్గంలోనే ఒక మోడల్ క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఈ గ్రౌండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చారిత్రాత్మకమైన ఈ మైదానం ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. అటువంటి ప్రాముఖ్యత ఉన్న ఈ మైదానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకువచ్చి క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, భవిష్యత్తులో ఇక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పుట్టుకురావడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహన్ కన్నన్, కదిర్వన్, వేణుగోపాల్ రెడ్డిలతో పాటు స్పోర్టింగ్ క్లబ్ ప్రెసిడెంట్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ నవీన్ రాజ్, కార్తీక్, బాలరాజు, ప్రేమ్ కిరణ్, రామ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకటనపై స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షునిగా డాక్టర్ రమేష్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 12 (డిడి9 వార్త ):**

టీఎన్జీవో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగ వైద్యుడు డాక్టర్ పల్లాటి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు విక్రమ్, శ్రీనివాస్, కోశాధికారి బాలరాజుల నేతృత్వంలో సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల ముఖ్య అధికారి కేఆర్ రాజ్‌కుమార్, సహాయ అధికారి ముఖేద్‌ఖురేషీలు తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా రమేష్, కార్యదర్శి బీఏ అభినాష్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ కల్పన, కోశాధికారి అబ్దుల్‌అజీజ్, అర్గనైజింగ్ సెక్రటరీ అల్బర్గ్‌బెన్ని, పబ్లిసిటీ సెక్రటరీ అఖిలేష్, ఈసీ సభ్యులుగా శ్యామ్‌కుమార్, అజయ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు నరేష్, శంకర్, వైదిక్‌శాస్త్ర, శ్రీధర్, వహీద్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరం ప్రతినిధులు రాజేందర్, నర్సింహారెడ్డి, శివ, సత్యంరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'బైకర్' విషయంలో మాట తప్పలేదు!



'తెలుగు సినిమా గర్వపడేలా 'బైకర్' ఉంటుందని నేను మొదటి నుంచి చెప్తూనే ఉన్నా. ఆ మాట తప్పలేదు. చెప్పినట్లుగానే మంచి కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాం'' అన్నారు కథానాయకుడు శర్వానంద్. ఆయన.. మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ సినిమాని అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. ''నేను మంచి ఫ్యామిలీ సినిమాలే చేస్తాననే నమ్మకాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కోల్పోలేదు. 'బైకర్'తోనూ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నా. ఇది మంచి మౌత్ టాక్‌తో వెళ్తోంది. దర్శకుడు అభిలాష్ మంచి తండ్రీకొడుకుల కథ చెప్పాడు. రాజశేఖర్ మాకెప్పుడూ హీరోనే. ఆయన ఈ చిత్రం చేసినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఇది చాలా లాంగ్ రన్ ఉండే సినిమా. ఈ వేసవి అంతా మా 'బైకర్'దే. దీంట్లోని రేసింగ్‌తో పాటు భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు'' అన్నారు దర్శకుడు అభిలాష్ రెడ్డి. నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. ''శర్వా హీరోగా చేసిన ఈ చిత్రంలో నేనింత మంచి పాత్ర చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్ర విజయానికి కారణం దర్శకుడు అభిలాష్ రెడ్డి'' అన్నారు. ఈ కార్యక్రమంలో మాళవిక, నిరూప్ తదితరులు పాల్గొన్నారు.

# బాక్సాఫీస్ దగ్గర 'డెకాయిట్' దూకుడు.. అడివి శేష్ కెరీర్‌లోనే భారీ ఓపెనింగ్స్



టాలీవుడ్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం డెకాయిట్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. విడుదలైన మొదటి రోజునుంచే మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రెండు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ చిత్రం అడివి శేష్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.28 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. మొదటి రోజు రూ.15 కోట్లు, రెండో రోజు రూ.13 కోట్లు రాబట్టడం ద్వారా ఈ సినిమా మంచి కలెక్షన్లను కొనసాగిస్తోంది. ఇక హిందీ వెర్షన్ కూడా ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మొదటి రోజు రూ.1.3 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ.1.75 కోట్లకు పెరగడం గమనార్హం.

సాధారణంగా రెండో రోజు డ్రాప్ కనిపించే సందర్భాల్లో, ఈ సినిమా మాత్రం గ్రోత్ నమోదు చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంతేకాదు, విదేశాల్లో కూడా 'డెకాయిట్' మంచి రన్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో బలమైన వసూళ్లు సాధిస్తూ, ఇప్పటికే $1 మిలియన్ మార్క్‌ను దాటడం చిత్ర బృందానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఎమోషనల్ ఫీల్ గుడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇద్దరి నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా శేష్ తన పాత్రలో చూపిన ఇంటెన్సిటీ, భావోద్వేగాలు సినిమాకు ప్రధాన బలం అయ్యాయి.

సినిమా టేకింగ్, మేకింగ్ విలువలు, కథనం అన్నీ కలిసి ఈ చిత్రాన్ని మరింత బలంగా నిలబెట్టాయి. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో వీకెండ్‌లో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. మంచి కంటెంట్‌తో పాటు బలమైన ప్రెజెంటేషన్‌తో వచ్చిన 'డెకాయిట్' సినిమా బాక్సాఫీస్ వద్ద మరో హిట్‌గా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా శర్వానంద్ బైకర్ చిత్రం కూడా విడుదల కాగా, ఈ మూవీ కూడా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది.



# మంగ్లీ కేసుతో సంబంధం లేదు

గాయకురాలు మంగ్లీ కేసుతో ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు వేణు ఉడుగుల స్పష్టతనిచ్చారు. ఈ కేసులో తనని భాగం చేస్తూ మీడియాలో వచ్చిన కథనాలు ఎంతగానో బాధపెట్టాయని అన్నారు. ఈ మేరకు సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.

''మంగ్లీ కేసుతో అనుసంధానం చేస్తూ నా పేరుపై మీడియాలో వచ్చిన వార్తలు చూసి బాధపడ్డా. ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదు. మంగ్లీ, ఫిర్యాదు చేసిన న్యాయవాది సుబ్బారావు ఇద్దరూ నాకు పరిచయం ఉన్న వ్యక్తులు కావడంతో, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడమని మాత్రమే సూచించా. అంతకుమించి ఇందులో ఎలాంటి పాత్ర పోషించలేదు. ఈ సందర్భంగా ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో కూడా నాపేరు నిందితుడిగా ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే, ఈ కేసు పెట్టిన సుబ్బారావు ఈ రోజు మీడియా ముందు మాట్లాడుతూ, నాకు ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా పేరును ఈ వ్యవహారంతో కలిపి ప్రచారం చేయడం బాధాకరం. పోలీసులు కూడా దీనితో నాకు సంబంధం లేదని నిర్ధరించారు. ఒక వ్యక్తి పరువు, కుటుంబ మర్యాద.. ఇలాంటి వార్తల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని నా విన్నపం'' అని వేణు ఉడుగుల తెలిపారు.

# నటుడి నుంచి రచయితగా.. రామ్ పోతినేని సరికొత్త ప్రయోగం!

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వెండితెరపై విజయవంతంగా రెండు దశాబ్దాల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 'దేవదాసు'తో మొదలైన ఈ ప్రయాణంలో లవర్ బాయ్‌గా, మాస్ హీరోగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇప్పుడు తనలోని ప్రతిభను బయటకు తీస్తున్నారు. గతేడాది విడుదలైన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో థియేటర్లలో సందడి చేసిన రామ్, ఆ సినిమా కోసం తొలిసారి గీత రచయితగా మారి పాట రాయడమే కాకుండా స్వయంగా పాడి అభిమానులను మెప్పించారు. దీంతో..

తాజా సమాచారం ప్రకారం, రామ్ ఇప్పుడు తొలిసారి కథా రచయితగా తన ప్రతిభను చాటుకోబోతున్నారు. ఇప్పటికే ఒక వైవిధ్యమైన కథను సిద్ధం చేసుకున్న ఆయన, దాన్ని పట్టాలెక్కించేందుకు సరైన దర్శకుడి కోసం అన్వేషణ మొదలు పెట్టారు. ఒక హీరోనే స్వయంగా కథ రాసుకోవడం అనేది సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తుంది. ఇప్పటికే లోకేశ్ కనగరాజ్ శిష్యుడు లోగి విఘ్నేశ్‌తో రామ్ తన తదుపరి ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపినట్లు వార్తలు వస్తున్నాయి. మరి లోగి విఘ్నేశ్ దర్శకత్వంలో రాబోయే సినిమానే రామ్ రాసుకున్న కథతో ఉంటుందా? లేక మరో దర్శకుడితో ఆ కథను పట్టాలెక్కిస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీని గురించి వచ్చే నెల (మే) 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్, ఆయన రచయితగా మారడంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తన 20 ఏళ్ల అనుభవంతో రామ్ ఎలాంటి కథను సిద్ధం చేశారో చూడాలని అటు అభిమానులు, ఇటు ఇండస్ట్రీ వర్గాలు ఆతృతగా ఎదురుచూస్తున్నాయి.



# నటిగా ఆ సినిమాతోనే నన్ను నేను తెలుసుకున్నా..

తెలుగు తెరపై 'గ్యాంగ్‌లీడర్'గా ఎంట్రీ ఇచ్చి, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రాళ్ల మనసు గెలుచుకున్న చెన్నై బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్. నాని సరసన పరిమితమైన హావభావాలతో మెప్పించిన ఈ భామ, ఆ తర్వాత 'శ్రీకారం'లో బబ్లీ గాళ్‌గా, ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఓజీ' (OG)తో స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను అందుకుంది. తాజాగా ఆమె నటించిన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం థియేటర్ల వద్ద యావరేజ్ అనిపించుకున్నా, ఓటీటీలో మాత్రం రికార్డ్ స్థాయిలో స్ట్రీమింగ్ అవుతూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రియాంక తన సినీ ప్రయాణం వ్యక్తిగత విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

ప్రియాంక మాట్లాడుతూ..'చిన్నప్పటి నుంచి నాకు నటనంటే ప్రాణం. సినిమాలు చూస్తున్నప్పుడు నన్ను నేను తెరపై చూసుకోవాలని కలలు కనేదాన్ని. బయో టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేసినప్పటికీ, నా ఆలోచనలన్నీ సినిమాల చుట్టూనే ఉండేవి. అందుకే చదువు పూర్తవ్వగానే వెండితెరకు పరిచయమయ్యాను' అని తెలిపింది. 2019లో కన్నడ సినిమా 'ఒంధ్ కథే హెళ్లా'తో కెరీర్ ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ, నాని, శర్వానంద్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని, ఇక పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ'లో నటించడం తన జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకమని చెప్పుకొచ్చింది. ముఖ్యంగా పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటానని చెప్పే ప్రియాంక, సవాలు విసిరే రోల్స్ అంటేనే తనకు ఇష్టమని అంటోంది.. 'వైవిధ్యభరితమైన పాత్రలు చేసినప్పుడే నటిగా గుర్తింపు వస్తుంది. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాలో అలాంటి పాత్రే చేశాను. ఆ సినిమా షూటింగ్ సమయంలో నటిగా నన్ను నేను కొత్తగా తెలుసుకున్నాను' అని ఆమె పేర్కొంది.



# ఆడిషన్ సమయంలో మా అమ్మ ముందే అలా అడిగారు

సినిమా ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ ప్రభావం ఎక్కువగా ఉందని, దానివల్ల కొంతమంది అమాయకులు బలవుతున్నారనే వాదనను అనేకమంది అనేకసార్లు వినిపించారు. కొంతమంది బహిరంగంగానే తాము సినిమా పరిశ్రమలో అలాంటి సమస్యలు ఎదుర్కొన్నట్లు వెల్లడించిన సందర్భాలు కూడా ఉన్నాయి. టాలీవుడ్‌లో నటిగా గుర్తింపు సంపాదించుకున్న వితిక శేరు తాజాగా తనకు చిన్న వయసులో ఎదురైన ఒక సంఘటన గురించి ఓపెన్ అయ్యింది. ఆమె మాట్లాడుతూ... "నాకు 16 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో ఓ సినిమా ఆడిషన్‌కి నేను మా అమ్మతో కలిసి వెళ్లాను. ఆడిషన్స్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక తర్వాత నన్ను సినిమాలో ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఆ తర్వాత నన్ను బయట ఉండమని చెప్పి మా అమ్మను లోపలికి పిలిచారు. ఆమెతో కమిట్‌మెంట్ గురించి అడిగారు. ఆ తర్వాత మా అమ్మ నన్ను లోపలికి పిలిచింది. అప్పటికే నాకు లోకజ్ఞానం కొంతవరకు ఉంది. ఎవరు ఎలా మాట్లాడుతున్నారు, ఎందుకు మాట్లాడుతున్నారు అనే విషయాలపై అవగాహన ఉండేది. వారు 'కమిట్‌మెంట్' గురించి మాట్లాడగానే నాకు చాలా బాధగా అనిపించింది. ఆ తర్వాత మా అమ్మ వారితో మీరు సినిమాలో అవకాశం ఇస్తే ఎలాంటి పారితోషికం లేకుండానే మా అమ్మాయి మీ సినిమాలో నటిస్తుంది. కానీ ఇలాంటి షరతులు మాకు అస్సలు నచ్చవు అని చెప్పి మేము అక్కడి నుంచి బయటకు వచ్చేశాము. ఇలా దాదాపు 14 ఏళ్ల క్రితం, నా 16వ ఏట నాకు ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది" అని ఆమె చెప్పుకొచ్చింది.






# ప్రదీప్ రంగనాథన్ ఖాతాలో మొదటి ఫ్లాప్..

'కోమలి'తో దర్శకుడిగా, 'లవ్ టుడే'తో హీరోగా మారి వంద కోట్ల క్లబ్‌లో చేరిన యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ కెరీర్‌లో మొదటిసారి పరాజయం పలకరించింది. వరుస హిట్లతో దూసుకుపోతున్న ఈ కుర్ర హీరోకి, తాజాగా విడుదలైన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (LIK) ఊహించని షాక్ ఇచ్చింది. స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో, లేడీ సూపర్ స్టార్ నయనతార నిర్మాణంలో భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది.. కారణం కథలో కొత్తదనం లేకపోవడం, కాన్సెప్ట్ బాగున్నప్పటికీ, నెమ్మదిగా సాగే కథనం, పాత చింతకాయ పచ్చడి లాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బోర్ కొట్టించాయి. ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీ అంటూ ప్రచారం చేసినప్పటికీ, థియేటర్లో కంటెంట్ లేకపోవడంతో ఆడియన్స్ ఈ సినిమాను తిరస్కరించారు.

ప్రచారంలో సరైన బజ్ లేకపోవడంతో ఓపెనింగ్స్ కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించిన నయనతారకు ఇది పెద్ద ఆర్థిక భారంగా మారిందని సమాచారం. దీంతో వరుస విజయాలతో టాప్ లీగ్‌లో ఉన్న ప్రదీప్ రంగనాథన్‌కు ఇది ఒక గుణపాఠం అని చెప్పాలి. కేవలం క్రేజ్ ఉంటే సరిపోదు, బలమైన కథాబలం ఉండాలని 'LIK' రిజల్ట్ మరోసారి నిరూపించింది. అయితే ప్రదీప్ లాంటి టాలెంటెడ్ నటుడు కేవలం ఒక ఫ్లాప్‌తో వెనకడుగు వేయడు. తన తదుపరి సినిమాలతో కచ్చితంగా బౌన్స్ బ్యాక్ అవుతాడని అభిమానులు ఆశిస్తున్నారు. 'డ్రాగన్', 'డ్యూడ్' వంటి చిత్రాలతో తన సత్తా చాటిన ప్రదీప్, ఈ అనుభవంతో తన నెక్స్ట్ ప్రాజెక్ట్స్ విషయంలో మరింత జాగ్రత్త పడే అవకాశం ఉంది.

# టాలీవుడ్ కోడలిగా మృణాల్ ఠాకూర్?..

టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ప్రతిభను కొనియాడుతూనే, ఆమె వ్యక్తిగత జీవితంపై ఆయన చేసిన సరదా కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మృణాల్ ఠాకూర్ నటనపై అల్లు అరవింద్ ప్రశంసల వర్షం కురిపించారు. "మృణాల్ చాలా గొప్ప నటి. తన నటనతో అతి తక్కువ కాలంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. సీతారామం సినిమాతో తనేంటో నిరూపించుకుంది. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది." అని ఆయన పేర్కొన్నారు.

**మృణాల్‌కు దీవెనలు..**

ఈ సందర్భంగా అల్లు అరవింద్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో నేను ఒక హీరోయిన్‌ను మనస్ఫూర్తిగా దీవించాను. ఆ తర్వాత ఆమె మా వరుణ్ తేజ్‌ను పెళ్లి చేసుకుని మా ఇంటి కోడలైంది (లావణ్య త్రిపాఠి). ఇప్పుడు మృణాల్‌ను కూడా అలాగే దీవిస్తున్నాను. నువ్వు చక్కగా తెలుగు సినిమాలు చేస్తూనే, ఇక్కడే ఒక మంచి వాడిని చూసుకుని పెళ్లి చేసుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లోనే సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని సరదాగా ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ సరదా కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

